నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 ఖమ్మం, శనివారం 20 జూలై 2024 BHADRADRI KOTHAGUDEM

- 'రుణమాఫీ'లో వేలాది మంది రైతులకు మొండి'చేయి'
- బ్యాంకుల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
- కాంగ్రెస్ సర్కార్ పోకడలపై అసంతృప్తి

# వడపోత.. భారీ కోత

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (నమస్తే తెలంగాణ) : మేము అధికారంలోకి వస్తే రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం విడుదల చేసిన లక్ష రుణమాఫీలోనే భారీగా కోతలు పెట్టింది. రుణాలు తీసుకున్న రైతులు లక్షల సంఖ్యలో ఉండగా వేలల్లో జాబితాను తయారుచేసి వడపోత పట్టింది. దీంతో శుక్రవారం వందలాది మంది రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయడం కనిపించింది. వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో సర్కారు పోకడపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందరికీ రుణ మాఫీ చేయ చేతకాని నాయకులు ఎన్నికల్లో హామీ ఎందుకు ఇవ్వాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్ష కాదు కదా రూ.40 వేలు కూడా మాఫీ కాకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 25,101 కుటుంబాలకు గాను 28,019 మంది రైతులకు రూ.132 కోట్ల రుణమాఫీ నిధులను సర్కారు మంజూరు చేసింది. భద్రాద్రి జిల్లాలో కేవలం సొసైటీల పరిధిలో 10,662 మంది రైతులకు రూ.329 కోట్లు మాఫీ అయ్యాయి. తొలిరోజే రైతు ఖాతాల్లో జమ చేస్తానన్న సర్కారు రెండోరోజు కూడా బ్యాంకుకు సొమ్ములు చేరకపోవడం గమనార్హం.


కొత్తగూడెం సొసైటీ కార్యాలయంలో లక్షలోపు తీసుకున్న రుణమాఫీ కాలేదని ఆధార్‌కార్డు ఇచ్చి చెక్ చేయించుకుంటున్న రైతులు


టేకులపల్లి మండలం బేతంపూడి సొసైటీలో లిస్టు చూస్తున్న రైతులు

## రుణమాఫీపై రైతన్నల పెదవివిరుపు

రుణమాఫీపై రైతన్నలు పెదవి విరుస్తున్నారు. శుక్రవారం బ్యాంకుల వద్దకు వెళ్లి పరిశీలించగా జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో బాధ పడుతున్నారు. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం పరిసర ప్రాంతాల రైతులు తమకు రుణమాఫీ రాలేదని 'నమస్తే' ఎదుట తమ గోడును చెప్పుకున్నారు.

## 'పహాణీ' రైతులకు మొండి'చేయి'

పాతకరణాలు చేసిన తప్పిదాలకు నేటికీ చాలామంది రైతులకు పట్టాలు రాని సంగతి తెలిసిందే. అలాంటి రైతులు చాలామంది పహాణీలపై బ్యాంకు రుణాలు తీసుకున్నారు. ఇటువంటి వారు కొత్తగూడెం సొసైటీ పరిధిలోనే 700 మందికి పైగా ఉన్నట్లు తేలింది. వారందరికీ రుణమాఫీ రాకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. తాము అర్హులం కాదా అని ప్రశ్నిస్తున్నారు.

### వివరాలు ఎవరూ చెప్పట్లే..



నాకు, నా భార్య పేరుమీద అన్నపురెడ్డిపల్లి ఏపీజీవీబీలో రూ.96 వేల రుణం ఉంది. రుణమాఫీ జాబితాలో నా భార్య పేరు వచ్చింది. మా ఇద్దరి పేరున రూ.లక్షలోపు మాత్రమే రుణం ఉంది. దీనిపై ఎవరిని అడిగినా వివరాలు చెప్పట్లేదు. బ్యాంక్‌కు వెళ్లి అడిగితే.. నా భార్య ఖాతాలో, నా ఖాతాలో నగదు జమ కాలేదని చెప్పారు. రూ.లక్షలోపు రుణం ఉన్న ప్రతి ఒక్కరికి మాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. నా రుణం మాఫీ అవుతుందా? లేదా? అనేది అర్థం కావడం లేదు.

**–మాయర శ్రీను, రైతు, రామకృష్ణాపురం, అన్నపురెడ్డిపల్లి మండలం**

### రూ.11 వేల రుణమాఫీ కాలేదు..



నాకు క్రాప్‌లోన్ రూ.11,400 బేతంపూడి సొసైటీలో ఉంది. ప్రభుత్వం చెప్పినట్లుగా రుణమాఫీ కాలేదు. గతంలో ఒక్కసారి మాత్రమే రుణమాఫీ వచ్చింది. తర్వాత ప్రతి ఏటా వడ్డీ కడుతున్నా. ప్రస్తుతం సొసైటీలో సభ్యుడిగా ఉన్నా.. జాబితాలో నా పేరు లేదు. నాకు న్యాయం చేయండి సారూ..

**–మాలోతు లాక్య, రైతు, ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు గ్రామం, టేకులపల్లి మండలం**

### బ్యాంకోళ్లు సమాధానం చెప్పట్లేదు..



నేను టేకులపల్లి ఎస్‌బీఐలో రూ.61 వేల వ్యవసాయ రుణం తీసుకున్నా. కానీ.. నిన్న ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో నా పేరు లేకపోవడం ఆందోళనగా ఉంది. దీని గురించి బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. ఇప్పుడు దీని గురించి ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు.

**– లాల్‌సింగ్, రైతు, దాస్‌తండా, టేకులపల్లి మండలం**

### రుణమాఫీ కాలేదు..



నా భార్యతోపాటు నా పేర అశ్వారావుపేట నాగార్జున బ్యాంక్‌లో రూ.2 లక్షలు వ్యవసాయంపై రుణం తీసుకున్నా. అయితే గురువారం ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో మా పేర్లు లేవు. దీని గురించి బ్యాంక్ వద్దకు వెళ్లి అధికారులను అడగ్గా.. మీ బ్యాంక్ ఖాతాలో రుణమాఫీ డబ్బులు ఇంకా జమ కాలేదని చెప్పారు. మరి మా పరిస్థితి ఏమిటనేది అర్థం కావడం లేదు. మళ్లీ అప్పు తెచ్చి వ్యవసాయం చేసుకోవాల్సిందేనా?

**–శిరిగినీడి దుర్గారావు, రైతు, అశ్వారావుపేట**

### మాట మారుస్తున్నారు..



కుర్చీ ఎక్కేదాక ఒక మాట.. ఎక్కినాక ఇంకోమాట. మొన్నటివరకు అందరికీ అప్పులు మాఫీ చేస్తం అన్నరు. నేను తీసుకున్నదే రూ.36 వేలు.. అదీ సొసైటీలోనే.. వేరే లోన్లు లేవు. నాకు మాఫీ కాలేదు. నాతోపాటు మా ఊర్లో చాలామందికి మాఫీ కాలేదు.

**– మాలోత్ మంగ్యా, ఉప్పరిగూడెం, సుజాతనగర్ మండలం**

### రూ.40 వేలు అప్పు ఉంది..



సుజాతనగర్ బ్యాంకులో రూ.40 వేలు అప్పు తీసుకున్న. రుణమాఫీలో పేరు రాలేదు. డబ్బులు కట్టాలన్నారు. మాకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియదు. లక్ష లోపు అన్నారు. నలభై వేలే తీసుకున్నా ఇవేం కొర్రీలు. నిన్నటివరకు ఎలాంటి నిబంధనలు లేవన్నారు. ఇప్పుడు పేర్లు వచ్చేసరికి కొంత మందికే వచ్చాయన్నారు.

**– మాలోత్ భవాని, ఉప్పరిగూడెం, సుజాతనగర్ మండలం**

### మాఫీకి కోతలు పెడుతున్నారు..



రుణమాఫీ అన్నారు. పేర్లలో కోతలు పెట్టారు. రేషన్‌కార్డు అంటున్నారు. ఇంట్లో ఇద్దరికి రాదంటున్నారు. నాకు ఎందుకు మాఫీ చెయ్యలేదో చెప్పాలి. సొసైటీలో అడిగితే పేరు రాలేదు మాకేం తెలుసు అంటున్నారు. ఎవరితో చెప్పుకోవాలి. మాఫీ చేసేటప్పుడే మీకు రాదని చెప్తే అప్పు చేసే వాళ్లం కాదు కదా.

**– జర్పుల కోటేశ్వరరావు, కోయగూడెం, సుజాతనగర్ మండలం**

### నా పేరు లేదు.. ఏం చేయాలో..



నేను బ్యాంకు నుంచి రూ.80 వేలు పంట రుణం తీసుకున్నా. ఆ డబ్బులు ఇంకా మాఫీ కాలేదు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.50 వేల రుణం తీసుకుంటే.. రుణమాఫీ అయింది. తిరిగి కొత్తగా రూ.80 వేలు లోన్ తీసుకున్నా. తీసుకున్న దానికి వడ్డీ రూ.2,600 చొప్పున బ్యాంకులో చెల్లించాను. నిన్న ప్రభుత్వ విడుదల చేసిన జాబితాలో నా పేరు లేదు. ఆ బ్యాంకు వద్దకు వెళ్లి అధికారులను అడిగితే సాయంత్రం వరకు జాబితా వస్తుందని చెప్పారు. ఇప్పుడేం చేయాలో తోయడం లేదు.

**–పూనెం రామ్మూర్తి, రైతు, దుమ్ముగూడెం**

### నా పేరు రాలేదన్నారు..



పంటలకు అప్పు తీసుకుంటే రుణాలు మాఫీ అయితయ్ అన్నరు. నా పేరు రాలేదన్నారు. నేనే వేరే బ్యాంకుల్లో కూడా అప్పు తీసుకోలేదు. పంట వేశాను.. సొసైటీలో అప్పు తీసుకున్న.. నిన్న అందరికీ వచ్చాయన్నారు. ఇప్పుడు రాలేదన్నారు. ఆ అప్పు కట్టాలంటే మళ్లీ బయట అప్పు చెయ్యాల్సిందే.

**– రాగ గడ్డయ్య, సింగభూపాలెం, సుజాతనగర్ మండలం**

### రూ.25 వేలే రుణం తీసుకున్న..



పెట్టుబడి సరిపోక సొసైటీలో రూ.25 వేలు అప్పు తీసుకున్న. నాకు పట్టాదారు పాసుపుస్తకం కూడా ఉంది. సర్వే నెంబర్ 264 బై 1 బై 196 పేరుతో భూమి పట్టా ఉంది. నిన్న ప్రకటించిన రుణమాఫీలో నా పేరులేదు. సొసైటీ దగ్గరకు వచ్చి అడిగితే లేదన్నారు. మరి ప్రభుత్వం ఎవరికి రుణమాఫీ చేసినట్టు. లక్షకే ఇవ్వకపోతే రెండు లక్షలకు ఇస్తారా.

**– భూక్యా రవికుమార్, ఉప్పరిగూడెం, సుజాతనగర్ మండలం**

## 24 గేట్లు ఎత్తి తాలిపేరు నీరు విడుదల


తాలిపేరు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

చర్ల, జూలై 19 : తాలిపేరు ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 74 మీటర్లు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 71.51 మీటర్లకు చేరింది. ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరే అవకాశం ఉన్నందున శుక్రవారం 24 గేట్లు ఎత్తి 2 అడుగుల మేర 24,065 క్యూసెక్కుల నీటిని దిగువనున్న గోదావరిలోకి వదిలారు. ఇన్‌ఫ్లో 24,379 క్యూసెక్కులు ఉన్నదని అధికారులు తెలిపారు. వరదల దృష్ట్యా సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు వారు తెలిపారు.

## హామీలు నెరవేర్చే వరకు పోరాటం

**భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జూలై 19 : ఆరు గ్యారెంటీల్లో 16 అంశాల హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని, వాటిని నెరవేర్చే వరకూ పోరాటాలు చేస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం మణుగూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, చదువుకునే అమ్మాయికి స్కూటీ, ప్రతి మహిళకు రూ.2,500, డిగ్రీ, పీజీ విద్యార్థులకు అకౌంట్లలో వేస్తానన్న డబ్బులు, ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా వంటి హామీలను గాలికొదిలి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగూడెంలో ఒక వృద్ధురాలు తీసుకున్న పింఛన్ రూ.లక్షా 70వేలు తిరిగి చెల్లించాలని ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. 70 లక్షల మంది రైతులకు ఎటువంటి షరతులు లేకుండా ఒకేసారి రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తానని.. చేయని సీఎం రేవంత్‌రెడ్డికి నోటీసులు ఇవ్వాలన్నారు.

### అవసరమైతే రేగా ట్రస్ట్ ద్వారా రిపేర్...

మణుగూరు వంద పడకల ఆస్పత్రి తన హయాంలోనే అభివృద్ధి చెందిందన్నారు. ఆస్పత్రిలో మరమ్మతుకు వచ్చిన ఆక్సిజన్ ప్లాంటును ఎమ్మెల్యే బాగు చేయించకపోతే.. రేగా ట్రస్ట్ నుంచి రూ.2.40 లక్షలు వెచ్చించి మరమ్మతు చేయిస్తానన్నారు. సమావేశంలో నాయకులు అడపా అప్పారావు, వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, కుంట లక్ష్మణ్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, రంజిత్, సృజన్, మట్టపల్లి సాగర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అపార నష్టం..

- ఇటు పాలకుల వైఫల్యం.. అటు అధికారుల నిర్లక్ష్యం..
- 'మాఫీ' సంబురాల్లో పడి 'పెదవాగు'ను మరిచిన ప్రభుత్వం
- వర్షాలు, వరద తీవ్రతతో 'పెదవాగు'కు అర్ధరాత్రి మూడు గండ్లు
- తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు, ముంపు గ్రామాల ప్రజలు
- 300 ఎకరాల్లో ఇసుక మేటలు, 100 ఎకరాల్లో కొట్టుకుపోయిన 'వరి'
- నీటి మునిగిన ఇళ్లు.. కోతకు గురైన రోడ్లు.. కూలిన విద్యుత్ స్తంభాలు
- తాగునీరు, విద్యుత్ లేక రెండు రోజులుగా అల్లాడుతున్న గ్రామస్తులు
- బిక్కుబిక్కుమంటున్న జనం.. 'భరోసా'పై నోరుమెదపని ప్రభుత్వం..
- బోసిబోయిన పెదవాగు ప్రాజెక్టు.. ప్రశ్నార్థకంగా ఈ ఏడాది 'సాగు'

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ అశ్వారావుపేట రూరల్, జూలై 19 : అటు అధికారుల నిర్లక్ష్యం వారికి అపార నష్టాన్ని కలిగిస్తే.. ఇటు కాంగ్రెస్ పాలకుల వైఫల్యం వారికి అంతులేని ఆవేదనను మిగిల్చింది. వీరి అలక్ష్యం కారణంగా అక్కడి ప్రజలు దాదాపుగా సర్వం కోల్పోయే పరిస్థితి తలెత్తింది. ఎగువన ఎడతెరిపిలేని వర్షాలు, దిగువన దూసుకొచ్చిన వరదల కారణంగా భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టుకు గురువారం అర్ధరాత్రి గండ్లు పడిన విషయం విదితమే. పెదవాగుకు వరద పోటెత్తుతున్న విషయంపై అప్రమత్తంగా ఉండాల్సిన ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. రుణమాఫీ సంబురాల్లో మునిగి తేలుతూ.. ప్రమాదపుటంచున ఉన్న కనీసం ఇక్కడి ప్రజల వైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. కనీసం అధికారులు కూడా పరిస్థితి అంచనా వేయలేదు. దీంతో వరద ఎక్కువై ప్రాజెక్టు కట్ట పైనుంచి ప్రవాహం కొనసాగింది. మరింత వరద పెరడంతో ఆ ధాటికి పెదవాగుకు అర్ధరాత్రి వేళ మూడు గండ్లు పడ్డాయి. ఫలితంగా దాని దిగువన ఉన్న గ్రామాల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతులేని ఆస్తినష్టం కలిగింది. 300 ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. 100 ఎకరాల్లో వరి పంటలు, మరో 50 ఎకరాల్లో ఉద్యాన పంటలు కొట్టుకుపోయాయి. దిగువ గ్రామాల్లో ఇళ్లు నీటి మునిగాయి. రహదారులు కోతకు గురయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. తాగునీరు, విద్యుత్ సరఫరా లేక ఆయా గ్రామాల ప్రజలు రెండు రోజులుగా అల్లాడుతున్నారు. జనం ఇంకా బిక్కుబిక్కుమంటున్నప్పటికీ 'భరోసా'పై ప్రభుత్వం ఇంకా నోరుమెదపలేదు. మరోవైపు పెదవాగు ప్రాజెక్టు బోసిబోయింది. దానికింద ఈ ఏడాది సాగు ప్రశ్నార్థకంగా మారింది.

## మొత్తం మూడు గండ్లు..

పెదవాగు ప్రాజెక్టుకు మొత్తం మూడు గండ్లు పడ్డాయి. అధికారులు సకాలంలో స్పందించకపోవడం, సమయానికి గేట్లు ఎత్తకపోవడం వంటి కారణాల వల్లనే ఇంతటి ప్రమాదం సంభవించిందని దిగువన ఉన్న గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఈ గుమ్మడవల్లి సమీపంలో పెదవాగుపై ప్రాజెక్టు నిర్మించారు. 6 మీటర్లు (40 వేల క్యూసెక్కులు) నీటి సామర్థ్యం, 16 వేల ఎకరాల సాగు లక్ష్యం. గుబ్బలమంగమ్మ అటవీ ప్రాంతం, చుట్టూ ఉన్న కొండల నుంచి వచ్చే వర్షపు నీరే ఆధారం. అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇక్కడి రైతులు ఈ ప్రాజెక్టు కింద రెండు పంటలూ సాగు చేసుకుంటున్నారు. 1984లో ఈ ప్రాజెక్టుకు ఒకసారి గండి పడింది. ఇప్పుడు కూడా అదే ప్రాంతంలో తిరిగి గండి పడింది. 2014లో రాష్ట్ర విభజన తరువాత అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాల రైతులు దీని కింద 2,360 ఎకరాలు సాగు చేస్తున్నారు. ఏపీలోని విలీనమైన వేలేపాడు, కుకునూరు మండలాల రైతులు 14 వేల ఎకరాల్లో పంటలు సాగుచేసుకుంటున్నారు. తాజా ప్రమాదంలో తెలంగాణలోని రెండు గ్రామాల రైతులతోపాటు ఏపీలోని ఆ రెండు మండలాల రైతులు కూడా నష్టపోయారు.


బచ్చువారిగూడెంలో చెరువుకు గండి

## వరద పోటెత్తినా గేట్లు తెరవలేదు..

పెదవాగు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోలేదని గుమ్మడవల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గురువారం ఉదయం 6 గంటలకు ఖమ్మంపాడు వరకు వరద పోటెత్తిందని, 10 గంటల వరకు గేట్లు తెరవకపోవడంతో ప్రాజెక్టుకు గండ్లు పడ్డాయని చెబుతున్నారు. ప్రాజెక్టు మోటార్లు చెడిపోయినా అధికారులు పట్టించుకోలేదని, అసలు అధికారులెవరూ ప్రాజెక్టు వద్ద లేరని రంగాపురం గిరిజనులు ఆరోపిస్తున్నారు. అలాగే, ఇదే మండలంలోని బచ్చువారిగూడెం, మల్లాయిగూడెం చెరువులకు రెండు చొప్పున గండ్లు పడ్డాయి. మరికొన్ని గ్రామాల్లో కూడా చెరువులు పొంగిపొర్లుతున్నాయి.

## విద్యుత్ శాఖకు భారీ నష్టం..

పెదవాగు ప్రాజెక్టుకు గండ్లు పడడంతో విద్యుత్ శాఖకు భారీగా నష్టం వాటిల్లింది. పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఫలితంగా పలు గ్రామాలు ఇంకా అంధకారంలో ఉన్నాయి. మరోవైపు తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. నారాయణపురం – గుమ్మడవల్లి మార్గంలో సుమారు 50కి పైగా విద్యుత్ స్తంభాలు కూలిపడ్డాయి. గుమ్మడవల్లిలోని 50 నివాసాల్లోని వరదనీరు చేరింది. వారంతా జెట్టివారిగూడెంలో పెదవాగు ప్రాజెక్టు భవనాల్లో తలదాచుకున్నారు.


వరిపొలాల్లో ఇసుక మేటలు


దెబ్బతిన్న పూరిల్లు


గుమ్మడవల్లిలో కూలిన పూరిల్లు


ప్రాజెక్టును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

### అధికారులు పట్టించుకోలేదు..



ప్రాజెక్టు నిండినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. ఖమ్మంపాడు వరకూ వరద నీరు పోటెత్తిందని ఉదయమే అధికారులకు సమాచారం ఇచ్చాం. తీరికగా వచ్చి 10:30కు గేట్లు తెరిచారు. అందువల్లనే ప్రాజెక్టు తెగింది. మా పంటలు కొట్టుకుపోయాయి. తీవ్రంగా నష్టపోతున్నాం. మా కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలి.

**–కంగాల శంకర్, రంగాపురం**

### నా భూమిలో ఇసుక మేటలు వేసింది..



నేను కౌలు తీసుకొని వరి సాగు చేస్తున్నాను. ఈ వరదకు నాటు కొట్టుకుపోయింది. పొలమంతా ఇసుక మేట వేసింది. ఇప్పటికే కౌలు చెల్లించాను. నాట్లకు రూ.10 వేలకు పైగా ఖర్చు చేశాను. ఇలా జరుగుతుందని ఊహించలేదు. ఇక నా పంట నా చేతికి రాదు. నా కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

**–పద్మ, గుమ్మడవల్లి**

### బిక్కుబిక్కుమంటూ గడిపాం..



గురువారం రాత్రి నుంచి బిక్కుబిక్కుమంటూ గడిపాం. కంటి మీద నిద్రలేదు. రాత్రి అయ్యేసరికి ఇళ్లలోకి నీరు చేరింది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని డబాపైకి ఎక్కాము. ఎట్టకేలకు ప్రాణాలు కాపాడుకున్నాము. ఇంట్లోకి వరద రావడంతో బురద పేరుకుపోయింది. ఈ రోజు దానిని శుభ్రం చేసుకుందామంటే నీళ్లు లేవు. రాత్రి నుంచి భోజనం కూడా లేదు. ప్రభుత్వం ఇటువైపు కనీసం కన్నెత్తి కూడా చూడలేదు.

**–రాజేశ్వరి, కొత్తూరు**














